ఈ రెండు సంవత్సరాలూ యెవరూ అనుభవించలేని సౌఖ్యాన్ని మనమనుభవించాము. దేవుడు మన దాంపత్యాన్ని చూచి ఓర్చలేక పోయాడు. నా అంత్యకాలంలో నీవుంటే భయపడతావనే నీవు పుట్టింటికి వెళ్లడానికి అంగీకరించాను జీవిత కాలమంతా పుట్టింటనే వుండవలసిన అగత్యంనీకు వుందని నాకు తెలుసు. పుట్టింటనే వుండు. నా భౌతిక రూపం నశించినా, నా ఆత్మ నీ పుట్టింటికే వస్తుంది. శాశ్వతంగా నీ వెంటనే వుంటుంది. నిన్ను కాస్తూనే వుంటుంది. నీస్థానం నీ పుట్టిల్లే. ఇక్కడ వుండకు. వెంటనే బయలు దేరు. నా ఆత్మ నీవెంట నేవస్తుందిప్పుడు. పూర్వం నీవు కోరినట్లు శరీరంతో రాలేకపోయినా, నా ఆత్మ నిన్నే ఆవరించి నీ వెంటనే వస్తుంది. నన్ను మరచిపోకు.

ఇట్లు,
నీ వాసు."

ఇంతలో తన తండ్రి వచ్చాడు అక్కడికి. ఉత్తరాన్ని ముఖాంకడ్డం పెట్టుకొని అతని భుజం మీద పడి భోరుమని యేడ్చింది.

స్కెచ్

# అంబా భీష్ముల సంవాదం

అవసరాల రామకృష్ణారావు

అసిస్టెంటు మేనేజరు శంకర్రావుకి ఆఫీసులో ఏమీతోచక సిగరెట్లు ఒకటిమీద ఒకటి తగలేస్తున్నాడు. నిజానికి అతనికి ఆఫీసులో పెద్ద చెప్పుకో తగ్గంత పనేమీ లేనేలేదు! పాపం మేనేజరే స్వయంగా అంకవనీ చక్కబెట్టుకుంటాడు. అలా చేస్తే కాని అతనికి తృప్తే వుండదు. ఇక ఎటొచ్చీ తన పని చిన్న గుమస్తాలంతా తమతమ పనులు సరిగ్గా చేసుకుంటున్నారో లేదో పరీక్షించడమే! పాపం, తీక్షణమైన ఎండలో మంచి జోడేనా లేకుండా పది గంటలకల్లా వచ్చేసి సాయంకాలం అయిదింటి దాకా, బితుకు బితుకుమని పని చేసే గుమాస్తాల మీద అధికారంచెలాయించటం అతనికి నిజానికి చేత కాదు. ఇక శంకర్రావుకి తీరికకు లోటేమిటి?

ఈ పాటికి యింటిదగ్గిర నిర్మల ఏంచేస్తోందో! తనలాగే తోచక బాధపడుతోంది కాబోలు! పోనీ యింటికి పోదామా అంటే కనీసం ఆఫీసులో ఎటెండన్స్ అయినా ఉండాలా? శంకర్రావుకి తన పేరు పత్రికలో చూసుకుందామని ఏనాటినుంచో కోరికగా వుంది. ఏదైనా రచన చేద్దామా అన్నా ఎప్పటికప్పుడు బద్ధకమే ఐపోతోంది. ఇవాళ ఎలాగైనా సరే ఏదో ఒక వ్యాసం రాసితీరాలని శంకర్రావు కలం, కాగితం తీసుకున్నాడు.

అరగంటసేపు కాగితాలయుద్ధభూమిలో కలాల బాణాలతో యుద్ధంచేసి, అనేక కాగిత- సైనికుల్ని హతమార్చి ఎలాగయితేనేం శంకరరావు విజయం పొందేడు. 'నేటి స్త్రీల విచిత్రగతులు' అని వ్యాసానికి పేరుపెట్టాడు. ఆ వ్యాసంలో సారాంశం ఇది: "భారతదేశంలో పూర్వపుస్త్రీల ప్రవర్తనకీ నేటి స్త్రీల ప్రవర్తనకీ చాలా తేడా ఉంది. పూర్వపు స్త్రీలకి భర్త అన్నా దేవుడన్నా కాస్త భయం భక్తీ ఉండేవి. నేటి స్త్రీలకు వీటితోపాటు సిగ్గూ, అభిమానమూకూడా లేవు. ఏదైనా తప్పుపని చేస్తే, భర్త ఎదిరిస్తే, విడాకులిస్తామని బెదిరిస్తున్నారు. కట్టుబాట్లూ నీతీ బొత్తిగా నాశనం అవుతున్నాయి. ఈ నాశనం స్త్రీ విద్యవలనే సంక్రమిస్తోందని నా ఉద్దేశం."

ఈ విధంగా స్త్రీమీద తనకుగల హేయ భావాన్నంతా ప్రకటనచేశాడు శంకర్రావు. ఈ వ్యాసం తీరాపడి తన భార్య నిర్మల చూస్తే! ఇలాంటి భేదాభిప్రాయాలు రాకుండా శంకర్రావు 'భీష్మ' అనే మారు పేరుతో ఒక పత్రికకు పంపేడు. సంపాదకుడు

ఏ కళనున్నాడో ఆ వ్యాసం వెంటనే ప్రచురించాడు. స్త్రీలు పత్రికలు చదివితే చెడిపోతారని ఉద్దేశంకలవాడు కాబట్టి శంకర్రావు ఆ వ్యాసం నిర్మలకు చూపలేదు.

మరో వారం రోజులు గడిచాయి. ఆవాళ మేనేజరు హడావుడిగా శంకర్రావు దగ్గరకు వచ్చి ఓ పత్రిక పడేసి, "ఏమోయ్ శంకరం, క్రితం వారం పత్రికలో 'భీష్మ' అనే వాడెవడో ఏదో వ్యాసం రాశాడు చూశావా? దానికి యీ వారం 'అంబ' అనే యెవరో స్త్రీ మా గట్టిగా జవాబిచ్చిందిలే! వెధవ వ్రాతలు వ్రాస్తే ఏమౌతుంది? మా బాగా అయింది!" అన్నాడు. శంకర్రావుకి శిరచ్ఛేదమయినట్లయింది. ఇంతకీ యీ 'అంబ' ఎవరూ? శంకర్రావు ఆత్రంగా పత్రిక తిరగేశాడు. అందులో ఓ పేజీలో యిలా వుంది: "శ్రీయుత 'భీష్మ' గారికి జవాబు: క్రితం వారం పత్రికలో పడిన భీష్మగారి వ్యాసం చదివి చాలా విచారించాను. సాంఘికంగా చాలా నూతన పరిణామం పొందినామని మన మనుకుంటున్న నేటి రోజుల్లోకూడా యిలాంటి ఛాందసపు వ్రాతలు వ్రాయడం స్త్రీ జాతికే అవమానకరం-పురాణ స్త్రీలకూ, నేటి స్త్రీలకూ చాలా తేడా వుందట. ఏం, మొగుడు కొట్టినా తిట్టినా చచ్చినట్టు పడివుండలేదనా, లేక సుమతిలా మొగుణ్ణి వేశ్యయింటికి మొయ్యలేదనా? ఏమిటో వీరిఅభిప్రాయం? మొగుడంటే సమాన ప్రేమతో సహజ ప్రణయంతో అభిమానించాలిగాని భయం ఎందుకు, భక్తి దేనికి? విడాకులిస్తామని బెదిరిస్తున్నారట! బెదిరించరూ? మొగుడు ప్రత్యక్షంగా పనిమందితో పోతూఉంటే కళ్లప్పగించి చూస్తూ ఊరుకుంటారా? అన్నిటికన్నా విచిత్రం, యీ పాడు బుద్ధులన్నీ స్త్రీలకు విద్యవల్లనే పుడుతున్నాయిట! ఈమాటకి కేవలం స్త్రీలేగాక ఏ పురుషుడూ ఒప్పుకోడు. (భీష్మగారిలాంటి స్త్రీ పురుషుడు తప్ప) ఇటువంటి అసందర్భపు తప్పుడు వ్రాతలు వ్రాయవద్దని భీష్మగారికి మా స్త్రీజాతి అంతటి తరఫునా, నా హెచ్చరిక—'అంబ'."

సాక్షాద్భీష్ముడైన శంకర్రావు కాలక్షేపార్థమై వ్రాసిన వ్రాతకు 'అంబ' అనే ఆ వనిత ఎవరోగాని వేరే పెనం లేకుండా శంకర్రావు మొహం నల్లగా మాడ్చేసింది. ఆడదైన అంబకే అంత పౌరుషమైనపుడు మొగాడైన భీష్ముడికేనా అహంకారం తక్కువ? తరువాత పత్రికలో యీ విధంగా వ్రాశాడు. "క్రితం సంచికలో శ్రీమతి అంబగారు అకారణంగా, అమానుషంగా నన్ను దూషించిన విషయం పాఠకులు చదివే వుంటారు. నన్ను స్త్రీ పురుషుడంది గాని ఆవిడ తన పేరే 'శిఖండి' అన్న విషయం గమనించలేనందుకు చాలా విచారిస్తున్నాను. తన్ను తాను తెలుసుకోలేనిది యింకొకరికి చెప్పేదేమిటి? యావద్భారత మగజాతి తరఫునా శ్రీమతి శిఖండిని నేను ఖండిస్తున్నాను-భీష్మ."

ఈ వ్యాసంపడిన సంచికను నిర్మలకు చూపద్దామని తన అఖండ విజయం ప్రదర్శిద్దామని శంకర్రావు చిరునవ్వుతో యింటికి వచ్చాడు. ఇంటికి వచ్చేసరికి నిర్మల ఏదో దీర్ఘంగా ఆలోచిస్తూ, యిటు తిరిగి 'ఆ సంచిక మీరూ కొన్నారూ, ఎంత తలవంపులుగా వ్రాశాడండీ ఆ భీష్ముడు వెధవ? ఎంత ఆలోచించినా యీమారు ఎలా జవాబు వ్రాయాలో తెలియడం లేదు. మీరు ఆ సంవాదం చదివే వుంటారు. ఈసారి, మరి వ్రాయకుండా బుద్ధి వచ్చేటట్టు పెద్ద వ్యాసం, మీతో కూడా ఆలోచించి వ్రాద్దామనుకుంటున్నాను. ఏం అలాగేనా?'' అని గుక్క తిప్పకుండా మాట్లాడింది. శంకర్రావు చేతిలో పత్రిక కింద పడిపోయింది! అతని బుర్ర రేకెట్ కన్నా ఎక్కువ వేగంగా తిరుగుతోంది. అతనికి నిర్మల, అర్జునుడిముందుకూర్చున్న శిఖండిలా కనిపించింది. అతనికి ఏమైనా భీష్ముడిరూపు వచ్చిందేమో అని రెండు చేతులతో గడ్డం తడుముకున్నాడు.

బెంజమిన్ ఫ్రాంక్లిన్ అనే ఆయన యిలా అన్నాడు: "జీవితంలో మానవుడు తప్పించుకోలేనివి రెండేరెండు: మరణమూ, ప్రభుత్వం విధించే పన్నులూ". అయితే ఆ కష్టాలు అదే వరసలో వస్తే బాగుండునని సామాన్యుడి భావన.